క్లుప్తంగా

క్యాబేజీకి గిరాకీ



సీతమ్మధార రైతుబజార్‌లో క్యాబేజీ బుట్టలు

సీతమ్మధార: క్యాబేజీకి గిరాకీ పెరగడంతో సీతమ్మధార రైతుబజార్‌కు రైతులు భారీగా సరకు తీసుకొచ్చారు. కిలో క్యాబేజీ బుట్ట రూ.10 ధర పలుకుతోంది. దీంతో వినియోగదారులు అధిక సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తామన్నారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వెంకన్నకు సమర్పిస్తామని, భక్తులు పాల్గొనాలని ఈవో కోరారు.

అప్పన్నకు బంగారు గొలుసు బహూకరణ



ఏఈవోకు బంగారు గొలుసు అందజేస్తున్న దాత గౌరీశంకర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నగరంలోని తాటిచెట్లపాలేనికి చెందిన మళ్ల గౌరీ శంకర్ అనే దాత సుమారు 42.730 గ్రాముల బంగారం గొలుసు కానుకగా ఇచ్చారు. ఉదయం స్వామివారి దర్శనానికి వచ్చిన దాత గొలుసును ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, సిబ్బంది సాంబ, నాయుడు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని సులక్షణ

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ప్రేక్షకులను అలరించింది. గుడిమెట్ల శారద శిష్యురాలు నడిమింటి సులక్షణ తన మృధు మధుర గానంతో త్యాగరాజ, ముత్తుస్వామి దీక్షితార్ కీర్తనలు ఆలపించి సంగీత లోకంలో విహరింపజేశారు. అభీష్టవరద, పరాకేల సరస్వతి, గురులేక, స్వామినాథ, హరియువతీం, మాయాతీత, బంటురీతి, బ్రోవభారమా, మంగళం, నారాయణతే నమో నమో కీర్తనలు పాడి మైమరపింపజేశారు. కె.శ్రీరామ్ శ్రీనివాస్ వయోలిన్‌పై, టి.ఎస్.చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని సులక్షణను సత్కరించారు.

సినీ గీతాలాపన రేపు

దాబాగార్డెన్స్: రాగమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'చెప్పవే చిరుగాలి.. చల్లగా ఎదగాలి' పేరిట తెలుగు సినీ గీతాలతో సంగీత విభావరి నిర్వహించనున్నట్టు రాగమయి వ్యవస్థాపకురాలు కందర్ప రాధ తెలిపారు. సంస్థ కార్యాలయంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు.

పబ్లిక్ డిమాండ్

స్తంభం వేశారు.. లైటు మరిచారు...



లైటు లేని విద్యుత్ స్తంభం

మురళీనగర్: మాధవధార సీతన్న గార్డెన్స్ సమీపంలోని మూడు రోడ్ల కూడలిలో వీధి లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడ ఎస్ఎస్ఆర్ రెసిడెన్సీ సమీపంలో ఒక విద్యుత్ స్తంభాన్ని వారం రోజుల కిందట మార్చారు. దానిపై వీధి లైటు ఏర్పాటు చేయడం మరిచారు. ఇది మూడు రోడ్ల జంక్షన్ కావడంతో రాత్రి పూట చీకట్లో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి లైటు ఏర్పాటు చేయాలి.

– సీహెచ్ శేఖర్, సీతన్న గార్డెన్స్

పేరుకుపోయిన చెత్తతో ఇబ్బందులు



సీతమ్మధార రైతుబజార్ పక్కనున్న రోడ్డులో చెత్త కుప్పలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ పక్కనున్న ప్రధాన రహదారిలో చెత్త కుప్పలు పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో స్థానికులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వ్యర్థాల నుంచి వెలువడుతున్న దుర్వాసన వల్ల ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. శానిటరీ అధికారులు దృష్టి సారించి సకాలంలో చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– జి.గోవింద్, సీతమ్మధార

పనుల్లో నాణ్యత కరువు



వాసుదేవనగర్‌లో సరిగ్గా రోలింగ్ చేయని రోడ్డు

తాటిచెట్లపాలెం: వాసుదేవనగర్‌లో జాతీయ రహదారికి ఆనుకుని రెండు రోజుల కిందట రోడ్డు నిర్మించారు. ఆ పనుల్లో నాణ్యత లేదు. వేసిన రోడ్డు కూడా సరిగ్గా రోలింగ్ చేయడం లేదు. దీంతో రోడ్డు నిర్మించిన వెంటనే తారుపిక్క పైకి వచ్చేస్తోంది. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రహదారి నిర్మాణం, మరమ్మతుల వల్ల ప్రజాధనం వృథా అవుతుంది. సంబంధిత అధికారులు దగ్గరుండి పర్యవేక్షించి రహదారి పనులు జరిపించాలి.

– పి.యాకోబు, వాసుదేవనగర్

ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



కళా ఆస్పత్రి రోడ్డులో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న ఎస్ఐ రామ్మూర్తి

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు ద్వారకానగర్ కళా ఆస్పత్రి రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టారు. 'ఇరుకు దారిలో భారీ వాహనాలు' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో వెలువడిన వార్తకు ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీసులు తక్షణం స్పందించారు. ఆ రోడ్డులోకి భారీ వాహనాలు రాకుండా శుక్రవారం ఉదయం ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి చర్యలు తీసుకున్నారు. కళా ఆస్పత్రి రహదారిలో అడ్డదిడ్డంగా పార్క్‌చేసిన వాహనాలను క్లియర్ చేసి ట్రాఫిక్ జామ్ కాకుండా చూశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుమతి లేకుండా వచ్చిన భారీ వాహనదారుడికి రూ.1,035 జరిమానా విధించినట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన చర్యలపై పలువురు వాహన చోదకులు, పాదచారులు హర్షం వ్యక్తం చేశారు.

సీతంరాజుకే మా మద్దతు

- ఏపీ టీచర్స్ యూనియన్

విశాఖ విద్య: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీర్వాదంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వైదేముదు, జి.దత్తాత్రేయశర్మ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, నిరుద్యోగ సమస్యలను ఎమ్మెల్సీగా గెలిస్తే సీతంరాజు పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. సుధాకర్ గెలుపు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ ఈ విషయాన్ని గుర్తించి ఈ నెల 13న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

కొలువుదీరిన దేవతామూర్తులు



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న పండితులు, భక్తులు



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలో శ్రీరామా సేవా సమాజం(యాదవ్) ఆధ్వర్యంలో నిర్మించి ప్రారంభించిన కోదండ సీతారామ, సంపత్ వేంకటేశ్వర స్వామి, ధనలక్ష్మిదేవి ఆలయాల్లో దేవతామూర్తులు కొలువుదీరారు. శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు నేతృత్వంలో శుక్రవారం విగ్రహాల ప్రతిష్టాపన, ధ్వజస్తంభం ఏర్పాటు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులు, అధికారులు దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 11వ తేదీ శనివారం ఉదయం సీతారాములు, సంపత్ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఒకే వేదికపై నిర్వహించనున్నట్లు గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామ, ఉత్సవ కమిటీల సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

దాబాగార్డెన్స్: నగరంలోని ఏవీఎన్ కళాశాలలో డెక్కన్ కెమికల్స్, శ్రీసాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో కెమిస్ట్రీ విద్యార్థులకు శుక్రవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. 20 మంది విద్యార్థులు అధిక వేతన ప్యాకేజీకి ఎంపికయ్యారు. కళాశాల ప్లేస్‌మెంట్ విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రి నాయుడు అధ్యక్షతన, జంతుశాస్త్ర విభాగాధిపతి ఎ.అర్చన పర్యవేక్షణలో ఎంపిక నిర్వహించారు. ప్లేస్‌మెంట్ అధికారి డి.సంతోష్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త పి.కృష్ణకుమారి పాల్గొన్నారు

ముగిసిన భద్రతా వారోత్సవాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

గోపాలపట్నం: నేవెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీలో వారం రోజులుగా నిర్వహించిన భద్రతా వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మానసి ఆడిటోరియంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు.ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పని చేసే ప్రాంతాల్లో భద్రతకు తొలి ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ఇందుకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. అసోసియేట్ డైరెక్టర్ పీవీఎస్ గణేష్ కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలు జరగక ముందే జాగ్రత్త వహించాలని సూచించారు. ఎన్‌టీపీసీ విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ జి. శ్రీనివాసరావు సేఫ్టీ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఆర్ఐఎన్ఎల్ సీనియర్ మేనేజర్ రుద్రప్ప బిహేవియర్ బేస్డు సేఫ్టీ గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త బీవీఎస్ఎస్ కృష్ణకుమార్, సేఫ్టీ విభాగం హెడ్ ఎస్ .రవికుమార్, సేఫ్టీ గ్రూప్ డైరెక్టర్ ఆర్. శ్రీహరి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి రామ్‌నాథ్ సెంకడ్రి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపార అవకాశాలు



ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో శుక్రవారం ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్, ఏయూ ఐపీఆర్ చైర్, ఏపీ చాంబర్స్, టీం ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సంయుక్తంగా 'ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్' అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించాయి. దీన్ని వీసీ ప్రారంభించి మాట్లాడారు. ఫుడ్ ప్రొడక్షన్ రంగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. డీఎఫ్ఆర్ఎల్, ఏపీ ఫుడ్ సొసైటీతో సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. నూతన ఆలోచనలతో వచ్చే యువతకు ఆర్థిక సహకారం అందించడానికి అనేక మంది పెట్టుబడిదారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆహార ఉత్పత్తి రంగానికి డిమాండ్ పెరుగుతూ వస్తోందన్నారు. ఏయూలో నూతనంగా ఫుడ్ టెక్నాలజీలో ఐదేళ్ల కోర్సును ప్రారంభించడంతోపాటు ఎమ్మెస్సీ సీట్లను పెంచామన్నారు. ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆహార కొరత లేకుండా వృథాను నియంత్రిస్తూ, వ్యవసాయ రంగానికి లాభదాయకంగా ఫుడ్ ప్రోసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు కావాలన్నారు. ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కొత్త ఆలోచనలతో పనిచేసే వారికి వైవిధ్యమైన అవకాశాలు ఉన్నాయన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి సింహాచలం మాట్లాడుతూ యువత పారిశ్రామికవేత్తలుగా మారాలన్నారు. ఉపాధి కోసం ఎదురుచూడకుండా ఉపాధి కల్పించే దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. నెట్‌వర్కింగ్ నిపుణుడు మిథున్ మాట్లాడుతూ వ్యాపార విస్తరణ, నిర్వహణలో నెట్‌వర్కింగ్ ఎంతో కీలకమన్నారు. శ్రావణ్‌షిప్పింగ్ అధినేత జి.సాంబశివరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో సహజ వనరులు అధికంగా ఉంటాయని చెప్పారు. ఎగుమతులు చేసే స్థాయికి యువతరం ఎదగాలన్నారు. టీం ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ డి.మధుసూదనరావు మాట్లాడుతూ ఎదగాలనే ఆకాంక్ష నూతన సంస్థల ఏర్పాటుకు నాందిగా నిలుస్తుందన్నారు. ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి జి.వి.ఆర్.నాయుడు సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



రైల్వేలో ఉత్తమ పనితీరు కనబర్చిన మహిళా ఉద్యోగులతో ఈకార్వో ప్రతినిధులు

- ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి
- ముగిసిన మహిళా దినోత్సవ వారోత్సవాలు



మహిళా ఉద్యోగిని సత్కరిస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

తాటిచెట్లపాలెం: దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ పారిజాత సత్పతి అన్నారు. తద్వారా సమాజంలో, దేశంలో మహిళా సాధికారత జరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్వో వాల్తేర్ ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ రోడ్డులోని రైల్ క్లబ్‌లో నిర్వహించిన ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆమె ప్రసంగించారు. విధి నిర్వహణలో ప్రతి మహిళా పోషిస్తున్న పాత్రను, అందుకోసం వారిలోని ప్రత్యేకతలను అభివర్ణించారు. రైల్వేలో ఉత్తమ పనితీరు కనబర్చిన సుమారు 50 మంది మహిళా ఉద్యోగులను పారిజాత సత్పతి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలువురు మోటివేషనల్ ప్రసంగాలు, ఆరోగ్య సూత్రాలతో మహిళలను ఉత్తేజ పరిచి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, సెక్రటరీ ప్రియాంక శ్రీదేవి, కోశాధికారి బిదిష చటర్జీ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డీఆర్ఎం అభినందనలు..

రైల్వే మహిళా ఉద్యోగులు తమ విధుల్లో ప్రదర్శిస్తున్న అంకితభావం, నిబద్ధతను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఒక ప్రకటనలో అభినందించారు. వాల్తేర్ డివిజన్‌లో మహిళలు(నారిశక్తి) ప్రయాణికుల భద్రత, రైళ్ల నిర్వహణ కోసం లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, ట్రాక్ మెయింటనర్లగా, లోకో షెడ్‌లో, సిగ్నల్ అండ్ టెలికాంలో, హెల్త్ యూనిట్స్‌లో, ఆర్పీఎఫ్‌లో తమ అద్భుతమైన పనితీరు చూపుతున్నారని ఆయన కొనియాడారు.

భద్రత.. అందరి బాధ్యత



భద్రత ఫ్యాషన్ షోలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

సీతంపేట: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ ఇంజినీరింగ్ అండ్ సేఫ్టీ(ఎన్ఐఎఫ్ఎస్) ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. 'భద్రతకు స్వాగతం పలుకుదాం.. ప్రమాదాలకు స్వస్తి చెబుదాం' స్ఫూర్తితో జరిగిన వారోత్సవాల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.వి.కృష్ణయ్య, జిల్లా ఫైర్ ఆఫీసర్ జె.మోహన్‌రావు, కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నైతిక విలువలతో పాటు భద్రత ఆవశ్యకతను తెలియపరచాలన్నారు. మోహన్‌రావు మాట్లాడుతూ భావితరాలకు భద్రత కలిగిన సమాజాన్ని అందించడం మనందరి బాధ్యతన్నారు. ఎన్ఐఎఫ్ఎస్ చైర్మన్ సునీల్ మహంతి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉన్నతమైన భవిష్యత్‌ను భద్రతా విభాగంలో కల్పించడమే తమ సంస్థ ఉద్దేశమని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన భద్రతా ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. రక్షణ సామగ్రి ధరించి వాటిని ఉపయోగించే విధానం, అవసరాన్ని తెలియపర్చేలా షో నిర్వహించారు. విభాగాధిపతులు కె.కుసుమకుమారి, యశోద, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార హోరు



ప్రశాంతినగర్‌లో గ్రాడ్యుయేట్లకు కరపత్రాలు అందిస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు



48వ వార్డులో పట్టభద్రురాలికి కరపత్రం అందిస్తున్న నీలి రవి, కర్రి రామారెడ్డి



సీతంపేటలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్



ఎన్జీజీవోస్ కాలనీలో కరపత్రం అందిస్తున్న పీలా వెంకటలక్ష్మి

తాటిచెట్లపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నియోజకవర్గంలో తారాస్థాయికి చేరుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం 45వ వార్డులో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్, కంపా హనోకు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. తాటిచెట్లపాలెం, ప్రశాంతినగర్ ప్రాంతాల్లో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు గ్రాడ్యుయేట్లను కలిసి కరపత్రాలను పంచారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, దుర్గ, రామారావు, ఆదిలక్ష్మి, సన్యాసప్పలనాయుడు, బాబూరావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజును గెలిపించండి

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్, ఎన్ఆర్ఐ హాస్పిటల్, ప్రైవేట్ స్కూళ్లలో నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్, విజయకుమార్‌లతో పాటు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో వైద్యులను కలిసి ఓటు వేయాలని మంత్రి కోరారు. ప్రచారంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 24, 14 వార్డుల కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, కె.అనిల్‌కుమార్‌రాజు, పార్టీ నాయకులు కిరణ్‌రాజు, అంబటి శైలేష్, సునీల్, మురళీకృష్ణారెడ్డి, లంకా భాస్కర్, అమర్‌నాథ్‌రెడ్డి, బల్ల శ్రీను, కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి అభ్యర్థన

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు 130 సచివాలయం పరిధి సీతంపేట నాయుడు వీధి, గొల్ల వీధి ప్రాంతాల్లో స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భోగవిల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, సారిపిల్లి గంగరాజు, బోర గోవింద్, వానపల్లి లక్ష్మణ్, ఉప్పాడ సన్నీ, గుడివాడ గౌరి, మువ్వల రాజారావు, పువ్వాడ గోవిందమ్మ, నంబూరి పద్మ, బోనుల జయ, రావాడ వీరమ్మ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

26వ వార్డులో..

జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలు పంచారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

48వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి బర్మాక్యాంప్, బాపూజీనగర్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులను కోరారు.

వర్క్ ఫ్రం హోమ్‌తో బహుళ ప్రయోజనాలు



సర్వే నివేదికను ఆవిష్కరిస్తున్న సిడార్ సంస్థ ప్రతినిధులు

సీతంపేట: కోవిడ్ మహమ్మారి కారణంగా వెలుగులోకి వచ్చిన వర్క్ ఫ్రం హోమ్ విధానం అటు వ్యాపార సంస్థలు.. ఇటు ఉద్యోగులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చిందని సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్(సిడార్) చైర్మన్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి తెలిపారు. ఇంటి నుంచి పని, ఉద్యోగుల దృక్పథాలు అనే అంశంపై సంస్థ చేపట్టిన సర్వే నివేదికను శుక్రవారం బుల్లయ్య కళాశాలలో జరిగిన సదస్సులో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కోవిడ్‌కు ముందు వర్క్ ఫ్రం హోమ్ విధానం లేకపోయినప్పటికీ వ్యాపార, సాఫ్ట్‌వేర్ సంస్థలు వాటి మనుడగ కోసం ఉద్యోగులు ఇంటి నుంచి పని చేయడం తప్పనిసరైందన్నారు. దీనివల్ల ఉద్యోగుల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు వారి జీవన విధానంలో మంచి సౌలభ్యం లభించిందన్నారు. ఈ సర్వేలో చాలా ఆసక్తికరమైన విషయాలు తెలిశాయని, వాటన్నింటిని క్రోడీకరించి నివేదిక రూపొందించామన్నారు. సిడార్ ప్రతినిధులు డాక్టర్ జి.మధుకుమార్, ప్రొఫెసర్లు బాలమోహన్‌దాస్, రామకృష్ణారావు, హరినారాయణ, పి.వి జయప్రకాష్, హెచ్.ఎల్.ఎన్.దొర, ఎల్.డి.సుధాకర్‌బాబు పాల్గొన్నారు.